క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందచేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి చిత్తూరు ఎస్పీ రూ.75 వేల ఆర్థిక సాయాన్ని అందచేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 29న బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ హెడ్‌కానిస్టేబుల్ చలపతి మృతి చెందారు. ఈయన సతీమణి రమాదేవికి గురువారం చిత్తూరులోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు చెక్కు రూపేణా ఆర్థిక సాయం చేశారు.

ఇంటింటా పశుగణన సర్వే



మైనగుండ్లపల్లెలో పశుగణన సర్వేను పరిశీలిస్తున్న వెటర్నరీ అధికారి డాక్టర్ లావణ్య

తవణంపల్లె: మండలంలో ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్లు పశుగణన పకడ్బందీగా సర్వే చేస్తున్నట్టు తవణంపల్లె వెటర్నరీ అధికారి, మండల పశుగణన సర్వే సూపర్‌వైజర్ డాక్టర్ లావణ్య తెలిపారు. గురువారం మండలంలోని మైనగుండ్లపల్లెలో పశుగణన సర్వేను పర్యవేక్షించారు. ఇంటింటికీ వెళ్లి పాడి రైతులతో మాట్లాడారు. సమాచారం సేకరించారు. మండలంలో మొత్తం 18,507 పశువులు ఉన్నట్లు లావణ్య చెప్పారు. మండలంలో వెటర్నరీ సిబ్బంది 14 మంది ఈ సర్వే చేస్తున్నారని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు దీనిని పూర్తి చేస్తామన్నారు.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి



యువరాజ్ కాంప్లెక్స్‌లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న సీపీఎం నేతలు

పలమనేరు: ప్రజలకు ఇబ్బందిగా మారే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని స్థానిక సీపీఎం నాయకులు గిరిధర్ గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమేరకు పలమనేరు పట్టణంలో ట్రాన్స్‌కో సిబ్బంది దొంగచాటుగా కార్యాలయాలు, దుకాణాల సముదాయాలకు బిగిస్తుండగా గురువారం వారు అడ్డుకున్నట్టు తెలిపారు. గతంలో చంద్రబాబు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని చెప్పి స్మార్ట్ మీటర్లను అమర్చితే పగులగొట్టాలని చెప్పారన్నారు. ఇప్పుడు అదే కూటమి పాలనలో చంద్రబాబు ఆదేశాలతోనే వీటిని ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోమన్న చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ చార్జీలను పెంచడం దారుణంగా ఉందన్నారు. దీనిపై త్వరలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

మత్తుకు జీవితాలను చిత్తు చేసుకోవద్దు

–పలమనేరు డీఎస్పీ ప్రభాకర్



మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు: యువత మాదకద్రవ్యాల మత్తుకు బానిసై జీవితాలను చిత్తు చేసుకోరాదని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ హితవు పలికారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల రహిత ఏపీ, సోషల్ మీడియా దుర్వినియోగం అనే అంశాలపై గురువారం జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. చెడు స్నేహాల ద్వారా మత్తు పదార్థాలకు విద్యార్థులు సైతం బానిసలు కావడం బాధాకరమన్నారు. దీంతోపాటు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, ఇంటర్‌నెట్‌ను ఎక్కువగా వినియోగించడం మంచిది కాదన్నారు. గంగవరం సీఐ ప్రసాద్, ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మదర్‌థెరీసా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్రమణ్యం మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైరన్ తాళాలతో చోరీలకు చెక్

చౌడేపల్లి: సైరన్ తాళాలతో దుకాణాలు, ఇళ్లలో చోరీలకు చెక్ పెట్టవచ్చని ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. గురువారం చౌడేపల్లెలో పలు షాపుల యజమానులకు సైరన్ తాళాలను ఎస్ఐ అందజేశారు. తాళాలను వాడే విధానంపై ఆయన అవగాహన కల్పించారు. తాళం తాకితే సైరన్ మోగుతుందన్నారు. ముందస్తుగా రూ.400 చెల్లించి ఆర్డర్ చేసుకున్న వారికి తాళాలను అందజేస్తామన్నారు. మండలంలో 40 మందికి సైరన్ తాళాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, మహిళా సంరక్షురాలు ప్రభావతి, దుకాణదారులు పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు భరోసా



బాలికకు ఇంటి వద్ద సేవలు అందిస్తున్న ఐఈఆర్పీ హిమబిందు

మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడుతున్న చిన్నారులకు వారి తల్లిదండ్రులకు తామున్నామంటూ మనోస్థైర్యాన్ని నింపుతున్నారు భవిత కేంద్రంలో పని చేసే ఐఈఆర్పీలు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రభుత్వం మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ఇద్దరు చొప్పున ఐఈఆర్పీలు పనిచేస్తున్నారు. వీరు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. ఐఈఆర్పీల (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్)ద్వారా సర్వేలు చేసి వారికి భవిష్యత్తు కోసం బాటలు వేస్తున్నారు.



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్

- ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాలు
- ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, శిక్షణతో వారి స్థాయిలో మెరుగుదల
- పరికరాలు పంపిణీ
- చిన్నారుల్లో మనోస్థైర్యం నింపుతున్న ఐఈఆర్పీలు

బంగారుపాళెం: బంగారుపాళెం తగ్గువారిపల్లెలో ఈ భవిత కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 24 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. మండలంలో 152 మంది వైకల్యం కలిగిన పిల్లలు ఉన్నారు. వీరిలో 128 మంది పిల్లలు ఇతర పాఠశాలల్లో చదువుతున్నారు. భవిత కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థి దశలోనే మానసిక దివ్యాంగులకు విద్యాబుద్ధులు చెప్పించడం, ఫిజియోథెరపీ చేయించడం, వారికి అవసరమైన పరికరాలు అందించడంతో పాటు వారి పనులు వారే స్వయంగా చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. గుర్తించిన పిల్లల వయస్సుతో పాటు వారి పరిస్థితిని అంచనా వేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అలాకాకుండా తగిన తర్ఫీదు, వివిధ సేవలు అవసరమున్న వారిని ముందుగా భవిత కేంద్రంలో చేర్చుకుంటారు. వీరికి స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, చిన్నతనంలోనే వికలాంగత్వాన్ని గుర్తించి తగిన కృత్యాలను, రోజు వారీ కార్యక్రమాలను పిల్లలకు నేర్పిస్తారు.



భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేక ప్రతిభావంతులు

ఇలా వారం, ఐదు రోజుల పాటు సేవలందించిన ఐఈఆర్పీలు పిల్లల ఇంటివద్దకు వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో ఫిజియోథెరపీతో పాటు శిక్షణ ఇస్తారు.

భవిత కేంద్రం నుంచి పై చదువులకు..

స్థానిక భవిత కేంద్రంలో విద్యను అభ్యసించి నిజాముద్దీన్, రమ్యశ్రీ బంగారుపాళెం ఉన్నత పాఠశాలలో చేరి 10వ తరగతిలో మంచి మార్కులతో పాసై జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్నారు. మండలంలోని వేపనపల్లెకు చెందిన అంధ విద్యార్థిని రేవతికి భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న ఇంటి వద్దకే విద్య కార్యక్రమం ద్వారా ఐఈఆర్పీలు ఇంటి వెళ్లి చదువు నేర్పించారు. అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నుంచి ఆమె డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం బెంగళూరులో కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతోంది.

చైల్డ్ అలవెన్సులు అందజేస్తూ..

ప్రత్యేక అవసరాల పిల్లలకు మూడు రకాల అలవెన్సులు ప్రభుత్వం ఇస్తోంది. బడికి వచ్చే మానసిక, బుద్ధిమాంద్యం ఉన్నవారికి ఇంటి వద్దే ఉన్న వారికి, ఆడపిల్లలకు ప్రత్యేక గర్ల్స్ చైల్డ్ అలవెన్స్ పేరిట నెలకు రూ 300 చొప్పున పది నెలలకు రూ 3 వేలను వారి తల్లిదండ్రుల ఖాతాల్లో ఏడాదికి ఒకేసారి జమ చేస్తోంది. పిల్లలకు అవసరమైన సామగ్రిని ఇవ్వడంతో పాటు బడికి వచ్చే పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, టై, బెల్ట్ కూడా ఇస్తున్నారు.

భవిత కేంద్రాల సేవలివే!

- మానసిక వికలాంగులకు ఎంఆర్ కిట్స్ ఉచితంగా ఇస్తారు.
- ఉచితంగా మధ్యాహ్న భోజనంతో పాటు బస్సు పాసులను అందించే అవకాశం కల్పిస్తారు.
- వేల రూపాయలు విలువ చేసే వినికిడి యంత్రాలు (హియరింగ్ ఎయిడ్స్), మూడు చక్రాల కుర్చీలు తదితర వాటిని ఉచితంగా ఇస్తున్నారు.
- అత్యంత తీవ్రమైన మానసిక వైకల్యం కలిగిన వారికి ప్రధానంగా దినసరి కార్యక్రమాలు (కాలకృత్యాలు)ఎలా చేసుకోవాలో కృత్యాలు(యాక్టివిటీ) ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు చేయిస్తూ, శిక్షణతో మెరుగు పరుస్తున్నారు. తద్వారా వారి భవితకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.
- మానసిక వికలాంగులకు దృశ్యరూపక వస్తువుల ద్వారా (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు.
- బధిర విద్యార్థులకు స్పీచ్ థెరపీలో ఫ్లాష్ కార్డు(అక్షరాల బొమ్మ) లిప్ రీడింగ్, టచ్ ద్వారా అక్షరాలు నేర్పిస్తున్నారు.
- దివ్యాంగుల్లో వైకల్య శాతం తగ్గి వారు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేలా తర్ఫీదునిస్తారు.



పిల్లలకు శిక్షణ

“ భవిత పాఠశాలలో ఐఈఆర్పీగా పనిచేయడం, పిల్లలకు చేస్తున్న సేవ ఒక భాగ్యంగా భావిస్తున్నా. మాటలు రాని పిల్లలకు మాట్లాడేందుకు, వారి పనులు వారే చేసుకునేలా శిక్షణ ఇస్తున్నాం. పిల్లలకు మేం ఇస్తున్న శిక్షణను తల్లిదండ్రులు సైతం ఇంటి వద్ద కొనసాగించాలి. అప్పుడే పిల్లలు త్వరితగతిన మెరుగవుతారు. తల్లిదండ్రులు తరచూ భవిత పాఠశాలకు వచ్చి మా సలహాలు, సూచనలు స్వీకరించాలి.

– హిమబిందు, ఐఈఆర్పీ, బంగారుపాళెం



తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

భవిత కేంద్రం ద్వారా ఎక్కువ మంది ప్రయోజనం పొందుతున్నారు. వారు వైద్య, రవాణా ఖర్చులు భరించాల్సిన అవసరం లేదు. మేము నేర్పిన అంశాలు, శిక్షణను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఇంటి వద్ద చేయించాలి. అప్పుడే ప్రయోజనం ఉంటుంది. సమస్య ఉన్న పిల్లలను తొందరగా గుర్తించి శిక్షణ ప్రారంభిస్తే మంచిది.

– మీరయ్య, ఐఈఆర్పీ, బంగారుపాళెం

జి.గొల్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



జి.గొల్లపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు బాలింతలు, గర్భవతులు, చిన్నారులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల వారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో రక్తదానం మిన్న



రక్తదానం చేసిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రిన్సిపల్

కార్వేటినగరం: అన్ని దానాల కంటే రక్తదానం మిన్న ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయలురెడ్డి అన్నారు.గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌సీసీ సంయుక్తంగా స్విమ్స్ బ్లడ్ బ్యాంకు సహకారంతో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరంలో 21 మంది రక్తదానం చేశారు. వీరిలో కళాశాల మ్యాథ్స్ లెక్చరర్ ధనంజయరెడ్డి కూడా ఒకరు. ధనంయజయరెడ్డి ఇప్పటివరకు 25 సార్లు రక్తదానం చేసి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ప్రిన్సిపల్ అభినందించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంకు అధికారి డాక్టర్ సురేష్, అధ్యాపకులు సీఎస్ లత, సుబ్బారావు, హరిబాబు, కార్తీక్, రఘు, బాబు తదితరులు పాల్గొన్నారు.

'దేవస్థానం సొమ్ముతో చెరువులో రోడ్డు వేయడం తగదు'

- అగరంపల్లె ఆయకట్టుచెరువుపై రోడ్డు ఎలా వేస్తారు?
- చెరువులో పిల్లర్లు లేకుండా రోడ్డు వేయడమా..!

కాణిపాకం: అగరంపల్లె చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణ తొలగించకపోగా.. ఆ చెరువులో రోడ్డు ఎలా వేస్తారని ఆయకట్టుదారులు అగరంపల్లి చరణ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. చెరువు ఆక్రమణపై జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయిననూ ఆ చెరువులో ప్రమాణాలు పాటించకుండా రోడ్డు వేయడం, పిల్లర్లు లేకుండా పనులు చేయడం ఎంతమాత్రమూ తగదని ఆక్షేపించారు. పిల్లర్లు నిర్మించి రోడ్డు వేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రోడ్డు పనులకు కాణిపాక దేవస్థానం నుంచి పెద్దమొత్తంలో నిధులు వ్యయం చేస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని, దేవస్థాన నిధులను రోడ్డుకు వెచ్చిస్తున్న పక్షంలో వెంటనే పనులను నిలుపుదల చేయాలని ఆలయ ఉభయదారుడిగా, ఆయకట్టుదారుడిగా డిమాండ్ చేస్తున్నానన్నారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న వినోద్‌కుమార్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ కట్టమంచిలోని సీఎంసీ కాలనీలో మృతదేహానికి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేల సాయం అందజేశారు. ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాధం తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో సత్తా చాటారు

కాణిపాకం: వైఎస్సార్ కడప జిల్లాలో గురువారం నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో పూతలపట్టు నియోజకవర్గ విద్యార్థులు సత్తా చాటారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. దేశభక్తి గేయాల ఆలాపనలో ధనుష్ (యాదమరి మండలం కె.గొల్లపల్లె హైస్కూల్) మొదటి స్థానం, క్విజ్‌లో నారాయణ (వరిగపల్లె హైస్కూల్) పోటీలో ద్వితీయస్థానం, వ్యాస రచనపోటీనలో హేమశ్రీ (బంగారుపాళ్యం మండలం మంగలపల్లె) మొదటిస్థానం, డిబేట్‌లో మంగలపల్లె విద్యార్థిని హేమ ద్వితీయస్థానం, ఐరాల మండలం పైపల్లె హైస్కూల్ విద్యార్థి రోహిత్ మొదటి స్థానంలో నిలిచారు. కడప ఆర్‌జేడీ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. యాదమరి మండల గైడ్ టీచర్స్ షెహనాజ్ బేగం, అరుణ శివప్రసాద్, కనకాచారి,భాస్కర రెడ్డి (బంగారుపాళ్యం), జిల్లా మహిళా నాయకులు హిమబిందు, స్వర్ణలత, మదన్‌మోహన్ రెడ్డి, గుణశేఖర్, శివప్రసాద్, సురేష్ రెడ్డి, విశ్వనాథ్, మోహన్ కుమార్, కాంచన తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బడుగుల ఆశాజ్యోతి పూలే



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో, అధికారులు, అసోసియేషన్ నాయకులు

- కలెక్టరేట్‌లో పూలేకు ఘన నివాళి

చిత్తూరు కలెక్టరేట్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని డీఆర్‌ఓ మోహన్‌కుమార్ కీర్తించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి డీఆర్వో మాట్లాడారు. పూలే బడుగు ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుడన్నారు. ఆయనో సామాజిక కార్యకర్తగా అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళలు, అణగారిన వర్గాల ప్రజల కోసం ఎనలేని కృషి చేశారన్నారు. విద్యలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, స్త్రీలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడి సాధికారతకు కృషి చేశారని స్మరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీ బాషా, సీపీఓ సాంబశివారెడ్డి, ఇతర శాఖల అధికారులు, బీజేపీ నాయకుడు అట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీసీఆర్ సర్కిల్‌లో..

కాణిపాకం: చిత్తూరు నగరంలోని పీసీఆర్ సర్కిల్‌లో పూలే విగ్రహానికి బీజేపీ నాయకులు ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర చౌదరి, అట్లూరి శ్రీనివాసులు, సుధాకర్, దొరబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ నాయకులు పూలమాలతో నివాళులర్పించి పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, గోపినాథ్, దామోదరం, మహేష్, విజయగౌరి, కుమారి, కోమలావతి, రఘు తదితరులు పాల్గొన్నారు. పూతలపట్టు మండల కేంద్రంలోని పూలే విగ్రహానికి దళిత నేతలు గజమాల వేసి ఘన నివాళి అర్పించారు.



పూతలపట్టులో నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



చిత్తూరులోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

వైభవంగా లక్ష బిల్వార్చన

- మార్మోగిన స్వామియే శరణమయ్యప్ప నామస్మరణ
- కనుల పండువగా కర్పూర హారతి
- శబరిమలకు బయల్దేరిన స్వాములు

పుత్తూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన వైభవంగా సాగింది. అయ్యప్పస్వామి పేరిట లక్ష నామాలతో లక్ష బిల్వార్చన ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరాటంకంగా భక్తి పారవశ్యంతో సాగింది. వేకువజామున వినాయకస్వామి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, స్వామివారిని చందనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 9గంటలకు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు కర్పూర హారతి కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. రాత్రి 8 గంటలకు అయ్యప్ప ఉత్సవమూర్తిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో అలంకరించి సుందరంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. స్వామివారిని మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఇరుముళ్లు ధరించిన అప్పయ్య స్వాములు వివిధ వాహనాల ద్వారా శబరిమల యాత్రకు బయల్దేరి వెళ్లారు.



కర్పూర హారతిలో పాల్గొన్న స్వాములు

పూలే బాటను విస్మరించిన కూటమి ప్రభుత్వం

– గాయత్రీదేవి, జ్ఞాన జగదీష్ విమర్శ

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు మహాత్మా జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల బాటలో బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనికి భిన్నంగా నడుచుకుంటోందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞాన జగదీష్ విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించి వారు మాట్లాడారు. అంటరానితనం నిర్మూలన కోసం, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు, మహిళలకు విద్యనందించేందుకు పూలే దంపతులు ఎనలేని కృషి చేశారని వారి సేవలను వివరించారు. 1848లో మహాత్మా పూలే సహచరి సావిత్రిబాయితో కలిసి దేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాలను స్థాపించారని, తొలి మహిళా ఉపాధ్యాయినిగా తన భార్యతోనే పాఠాలు చెప్పించారన్నారు. అంతేకాకుండా తన అనుచరులతో నిమ్న కులస్తుల సమాన హక్కుల కోసం 'సత్య శోధక్ సమాజ్' సంస్థను ఏర్పాటు చేసి, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. వితంతు శరణాలయాలను స్థాపించడమే గాక ఒక బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన బిడ్డను దత్తత తీసుకొని, ఆ బిడ్డను డాక్టరుగా తీర్చిదిద్దిన ఘనత పూలే దంపతులకే దక్కుతుందన్నారు. అంతటి మహనీయుల స్ఫూర్తితో గత ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తే, కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కేపీ శ్రీధర్, నారాయణ, వెంకటేష్, నవీన్‌యాదవ్, మహేష్, రంజిత్, రాజేష్, మనోహర్, ప్రభాకర్, మదన్, సెల్వ, సంతప్, హమీద్, గీత, శంకరయ్యగుంట జస్టిన్ తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గాయత్రీదేవి, జ్ఞాన జగదీష్, నాయకులు

ముక్కు మూసుకోవాల్సిందే..!



నగరంలోని 45వ డివిజన్ సంతపేటలోని మంగసముద్రంలో చెత్త పేరుకుపోయింది. చాలా రోజులుగా ఈ చెత్త అలాగే ఉండడంతో దుర్గంధం చిమ్ముతోంది. అటు వైపు వెళ్లే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. చెత్తాచెదారం కుప్పలు, కుప్పలుగా పేరుకుపోవడంతో దోమల మోత పెరిగిందని ఆ డివిజన్ ప్రజలు మండిపడుతున్నారు. నగరపాలక కమిషనర్ స్పందించి చెత్త తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– చిత్తూరు కలెక్టరేట్